## క్లుప్తంగా

### విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



పెనుగంచిప్రోలు: మండలంలో విత్తనాల దుకాణాలను ఏఓ రామసుబ్బారెడ్డి బుధవారం తనిఖీలు చేశారు. విత్తన దుకాణాల్లో స్టాక్, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. పత్తి, మిరప విత్తనాల స్టాక్ లభ్యతను ఆరా తీశారు. విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని డీలర్లకు సూచించారు. లేనిచో కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

### వైభవంగా ఆలయ పునఃప్రతిష్ట



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మండలంలోని అనుమంచిపల్లిలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఆలయాన్ని పునర్నిర్మించారు. స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### కిశోర బాలికలకు అవగాహన



నందిగామరూరల్: రుతుక్రమ సమయంలో కిశోర బాలికలు, మహిళలు విధిగా పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు కామేశ్వరి, గౌతమి సూచించారు. మండలంలోని లింగాలపాడు పీహెచ్‌సీలో రుతుక్రమం–ఆరోగ్యం–పరిశుభ్రతపై కిశోర బాలికలు, మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టిక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రుతుక్రమ సమయంలో తగినంత విశ్రాంతి తీసుకోవాలన్నారు. రుతుక్రమ సమయంలో వినియోగించిన శానిటరీ ప్యాడ్స్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా కాల్చివేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బిక్షాలు, సూపర్‌వైజర్లు సరోజిని, నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, అంగనవాడీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

### బోరుకు మరమ్మతులు



కంచికచర్ల : వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గండేపల్లి పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ తెలిపారు. మండలంలోని గండేపల్లి గ్రామ సచివాలయం వద్దనున్న బోరుపంపు మరమ్మతులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గండేపల్లివాసులకు నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఎగువ ప్రాంతాలకు తాగునీరు సరఫరా కాకపోతే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మెకానిక్‌లు పుల్లారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

### యోగా శిక్షణ

చిల్లకల్లు(జగ్గయ్యపేట: యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై శిక్షణనిచ్చారు. యోగా ట్రైనర్ అశ్విని ఆధ్వర్యంలో మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. యోగా సాధనతో కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించారు.

### బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు తమ వివరాలతో జూన్ మూడోతేదీలోగా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టుసెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

# రోడ్లపైనే పారుతున్న మురుగు

- కంచలలో కానరాని పారిశుద్ధ్యం
- డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్



గోతులమయమైన కంచలలోని ప్రధాన రోడ్డు



కంచలలోని తూర్పుబజారులో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నందిగామ రూరల్: నందిగామ మండలంలోని కంచల గ్రామం సమస్యలతో కొట్టుమిట్లాడుతోంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగంతా రోడ్లపైనే చేరుతోంది. దీంతో నడిచేందుకు కూడా వీలులేక గ్రామస్తులు అవస్థలుపడుతున్నారు.

**దోమల ఉధృతితో బెంబేలు..**

గ్రామంలోని పలు వీధుల్లోని రహదారులపై పారుతున్న మురుగు నీరు కారణంగా దోమల ఉధృతి అధికంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో గ్రామస్తులు వ్యాధుల బారినపడుతున్నారు. వేసవిలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకే పరిస్థితి దయనీయంగా ఉంటే, రానున్న వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని తూర్పు బజారుతోపాటు అంతర్గత రోడ్లలో డ్రైనేజీలు నిర్మించాలని పలుమార్లు కోరినా పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



పాకుడు పట్టి ఉన్న కుళాయిలు

**అధ్వానంగా ఉన్న రోడ్డు..**

గ్రామంలోని ప్రధాన రహదారి సైతం పెద్దపెద్ద గుంతలతో వర్షపు నీటితో నిండిపోయింది. కంచికచర్ల మండలం కీసరలోని 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి కంచల, చందర్లపాడు మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా చెరువు మూల వద్ద రహదారి రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**అపరిశుభ్రంగా పరిసరాలు...**

గ్రామంలోని ఆయా వీధుల్లో ఉన్న తాగునీటి కుళాయిలు అపరిశుభ్ర వాతావరణంలో దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధుల్లో మురుగు కాల్వల అంచున, పిచ్చిగడ్డి మధ్యలో కొళాయిలు ఉన్నాయి. మరి కొన్ని వీధుల్లోని కొళాయిల చుట్టూ పాకుడు పట్టి అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా దర్శనమిస్తుండటం గమనార్హం. ఇకనైనా అధికారులు కంచల గ్రామంలో నెలకొన్న ఆయా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఇబ్బందిపడుతున్నాం...**



మా బజారులో డ్రైనేజీ సదుపాయం సరిగా లేకపోవడంతో వర్షపు నీరు, ఇళ్లలోని వాడుక నీరు పారుదల కావడం లేదు. ఇళ్ల పక్కనే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. వర్షాల సమయంలో మురుగంతా రోడ్డుపైకి చేరుతుండటంతో ఇబ్బందిపడుతున్నాం.

– చలమల కోటేశ్వరి

**డ్రైనేజీ నిర్మించాలి...**



గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా వర్షం పడిన సమయంలో పరిస్థితి దయనీయంగా ఉంటుంది. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– కోలగట్ల కుటుంబరావు

## సినిమా థియేటర్ల తనిఖీ



నందిగామలో సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు




కమలా థియేటర్‌లో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్

నందిగామటౌన్: సినిమా థియేటర్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు సూచించారు. పట్టణంలోని విజయా టాకీస్, లక్ష్మీప్రసన్న, మయూరి థియేటర్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సినిమా టికెట్లు, తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే థియేటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని అలంకార్ మల్టీప్లెక్స్, కమలా థియేటర్లను జగ్గయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ బుధవారం తనిఖీలు చేశారు. థియేటర్‌ల రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా ఫైర్, లైసెన్స్, మరుగుదొడ్లు, క్యాంటీన్‌లను పరిశీలించారు. రెండు రోజులుగా థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడంతో సినిమా షోలను నిలిపివేశామని థియేటర్ల యజమానులు, అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సూరమ్మ, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



వత్సవాయిలో ఖరీఫ్ సాగు కోసం సిద్ధం చేసిన పొలం

వత్సవాయి : మే నెల తుదిదశకు చేరింది. ఇప్పటికే అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈఏడాది కూడా ఖరీఫ్ పంట ముందుగానే చేపట్టే అవకాశాలు కనపడుతున్నాయి. వాతావరణం చల్లబడి తేలికపాటి వానలు పడుతుండటంతో పొలాలను సాగుకు సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గత సీజన్‌లో వేసిన పంటలను ట్రాక్టర్ల ద్వారా తొలగించి శుభ్రపరిచి పొలాలను దుక్కులు దున్నుతున్నారు. పొలాల గెట్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి తగలబెడుతున్నారు. ముందుగా పత్తి పంట వేసే పొలాలలో ఎరువును తొలి సిద్ధం చేస్తున్నారు.

**వేలాది ఎకరాల్లో సాగు..**

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మూడు మండలాల్లో ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలతో పాటు కొద్దిమొత్తంలో కంది, పెసర, మినుము వంటి పంటలను సాగుచేస్తుంటారు. గత ఖరీఫ్ సీజన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో పత్తిపంటను 18,500ఎకరాల్లో సాగుచేయగా, మిర్చి 13,750 ఎకరాలు, వరి 17,750 ఎకరాలు, మొక్కజొన్న 450 ఎకరాల్లో సాగుచేశారు.

**విత్తన ఎంపిక కీలకం..**

పంటల సాగులో అత్యంత కీలకమైన అంశం విత్తన ఎంపిక. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న తీవ్ర నష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుందని వ్యవసాయాధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పత్తి విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లో విత్తన బుకింగ్ ఏజెంట్లను నమ్మవద్దని, పంటకాలం పూర్తయ్యేవరకు రైతులు ఆయా రశీదులను భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ సూచిస్తున్నారు.

**అందని పచ్చిరొట్ట విత్తనాలు...**

ప్రభుత్వం నుంచి ఇంకా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా మే నెలలోనే రైతులకు జీలుగులు, పిల్లిపెసలు వంటి విత్తనాలు రైతులకు అందించారు. కాని ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ఊసే ఎత్తకపోతుండటం గమనార్హం. ఖరీఫ్ సాగు కొద్దిరోజుల్లో ప్రారంభవుతున్నందున ఇకనైనా ప్రభుత్వం స్పందించి పచ్చిరొట్ట ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు.

## యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి



సీడీ ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరావు, వేదికపై గుప్తా, దాస్, జగన్నాథరావు, తపస్వి తదితరులు

విజయవాడకల్చరల్: యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ సృజనాత్మక సమితి, తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన భారత జవాన్లకు ఘననివాళి, ఓ త్యాగమయిలారా సీడీ ఆవిష్కరణ, ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ దేశరక్షణ కోసం అనుక్షణం తపిస్తూ జీవితాలను త్యాగం చేస్తున్న సైనికులు సదా స్మరణీయులని కొనియాడారు.

**కళాకారుల అభివృద్ధికి కృషి..**

సీడీని ఆవిష్కరించిన ఏపీ సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన నటుడు నందమూరి తారక రామారావు అని అభివర్ణించారు. సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తునట్లు తెలిపారు. విద్యావేత్త ఎంసీదాస్ మాట్లాడుతూ భారతదేశ సైనిక శక్తికి ప్రపంచమే పాదా క్రాంతమైందన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ కార్యదర్శి సూర్యదేవర జగన్నాథరావు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వేమూరి నాగేశ్వరశర్మ, కుమార సూర్యనారాయణ, గాయని సుధాశ్రీనివాస్, తపస్వి పాల్గొన్నారు. హేమంత్‌కుమార్ బృందం దేశ భక్తి గీతాలకు నృత్యాలను అభినయించింది. వీర్ల ప్రసాద్ రచించి, వెనిగళ్ల భాస్కర్ దర్శకత్వం వహించిన వామ్మో గుత్తి వంకాయ్ హాస్యనాటికను ప్రదర్శించారు.

## యాసిడ్ దాడి నిందితురాలికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్‌పై యాసిడ్ దాడి చేసిన నిందితురాలు ఇందిరా ప్రియదర్శికి కోర్టు రిమాండ్ విధించింది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ప్రియదర్శిని ప్రిన్సిపాల్ వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించారు. ఈనెల 19న ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చిన ఆమె ఆయనపై యాసిడ్ దాడికి పాల్పడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం నిందితురాలిని కోర్టులో హాజరుపర్చగా ఆమెకు రిమాండ్ విధించి విజయవాడ సబ్ జైలుకు తరలించారు.

## కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



జగ్గయ్యపేట గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత విద్యార్థులచే పుస్తకపఠనం చేయించారు. డ్రాయింగ్, క్యారమ్స్‌పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, నార్ని వెంకటేశ్వరరావు, ఎర్రం భాస్కరరావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు

**జగ్గయ్యపేటలో..**

జగ్గయ్యపేటఅర్బన్: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులచే పుస్తకపఠనం చేయించారు.విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అలేటి ప్రభ, సిబ్బంది జె.శ్యామల, బీడీసీ మల్లిక, రమేష్, రాము పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : ఈయూ



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె కోటేశ్వరరావు తెలిపారు. విద్యాధరపురంలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ వద్ద బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ యూనియన్ సాధించిన విజయాలను తెలియజేశారు. నాన్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగుల సమస్యలపై ఈడీ(ఎ), ఈడి(ఇ)తో ఇటీవల చర్చించామని చెప్పారు. వాటిల్లో నాన్ ఆపరేషన్ ఉద్యోగులకు కరోనా పిరియడ్‌ను మ్యానోవర్ రేటు మినహాయింపు ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలుకూడా వచ్చినట్లు వివరించారు. వర్క్‌షాపుల్లో క్యాంటీన్లు లేనిచోట అన్‌పెయిడ్ ఇన్సెంటివ్ అమౌంట్ మొత్తం త్వరలో చెల్లించేలా ఆదేశాలు ఇచ్చేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. మూవింగ్ యావరేజ్‌ను టీఆర్ఎస్‌లో మాదిరిగా వర్క్‌షాపుల్లో ఉద్యోగులకు ఇవ్వాలని ఈయూ చేసిన అభ్యర్థన మేరకు ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా ఇచ్చి అనంతరం ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తిరిగి చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు ప్రకటించారన్నారు. విజయవాడ జోనల్ వర్క్‌షాప్‌లో 2015–17కు సంబంధించి మ్యానోవర్ రేట్‌ను ఈనెల రికవరీ చేసేందుకు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఆదేశాలను ఈడి(ఎ), ఈడి(ఇ)లతో చర్చించి నిలుపుదల చేయించిన ఘనత తమ యూనియన్‌దేనని తెలిపారు. కార్యక్రమంలో నాన్ ఆపరేషన్ కార్యదర్శి వి.శ్రీధర్, వర్క్‌షాప్ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, స్టోర్స్ కార్యదర్శి ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

## 'ఆచంట' నటన అజరామరం



ఆచంట విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు వారికి మాత్రమే సొంతమైన పద్య నాటకాల్లో విశేష ప్రతిభాపాటవాలను ప్రదర్శించి రంగస్థల రారాజుగా కీర్తిప్రతిష్టలు గడించిన ఆచంట వెంకట రత్నం నాయుడి నటన అజరామరమని పలువురు కళాకారులు, కళాసంస్థల నిర్వాహకులు కొనియాడారు. ఆచంట జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహం వద్ద బుధవారం ఘన నివాళులర్పించారు. ఏపీ నటీనట, నాట్య వృత్తి కళాకారులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. రంగస్థల రారాజుగా విరాజిల్లి తనదైన ప్రత్యేక శైలితో నటించి ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహానటుడు ఆచంట అన్నారు. అటువంటి మహోన్నత నటుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో జన్మించడం జిల్లావాసులకు గర్వకారణమన్నారు.

**ఆచంట చిరస్మరణీయుడు..**

పౌరాణిక నటుడు నరాలశెట్టి రవికుమార్ మాట్లాడుతూ.. ఆచంట సమక్షంలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించి ఆయన ప్రశంసలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కంది గంగాధరరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఆచంటతో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేశారు. కళాపోషకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ దుర్యోధన ఏకపాత్రాభినయంతో గుర్తింపు పొందిన అనంతరం పద్యనాటక రంగంలో వైవిధ్యమైన పాత్రలు పోషించి నటనలో తన ప్రత్యేకతను చాటుకున్న ఆచంట చిరస్మరణీయుడన్నారు. ఆచంట బాలాజీ నాయుడు మాట్లాడుతూ తండ్రి వెంకట రత్నం నాయుడి నటనా వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో అనేక పౌరాణిక నాటకాలను ప్రదర్శించి ఆయన పేరును నిలబెట్టగలిగినందుకు గర్వంగా ఉందన్నారు. ఆచంటకు నివాళులర్పించిన వారిలో ఏపీ కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, శారదా కళా సమితి వ్యవస్థాపకుడు దోగిపర్తి శంకరరావు, వెన్నా వల్లభరావు, చివుకుల హరగోపాల్, కళామంజరి వ్యవస్థాపకులు నృసింహం పాల్గొన్నారు.

## నిరంతర సాధన ప్రగతికి సోపానం



విజయవాడకల్చరల్: నిరంతరం సాధన ప్రగతికి సోపానమని సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. సంస్కారభారతి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో 10 రోజులుగా అయోధ్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్న సంగీత శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత సాధన వల్ల ఏకాగ్రత అలవాటు అవుతుందని చెప్పారు. గాత్రంతో వాక్ స్పష్టత వస్తుందని తెలిపారు. భాషలో ఉచ్ఛరణ దోషాలు పోతాయని పేర్కొన్నారు. శిబిరంలో భగవద్గీత, లలిత, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చామన్నారు. సంగీత శిక్షకురాలు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాలని సూచించారు. సంస్కారభారతి నగర అధ్యక్షుడు భాస్కరశర్మ, దుర్గా శ్రీనివాస్, అల్లు రాంబాబు, ఎం.జ్యోతి, సాయి శంకర్, శివకుమార్ పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

### నందిగామ డివిజన్‌లో 116.2 మి.మీ. వర్షపాతం

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో మంగళవారం రాత్రి 116.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డివిజనల్ ఉపగణాంకాధికారి ప్రసాద్ బుధవారం తెలిపారు. నందిగామ నియోకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 54.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 61.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వత్సవాయి మండలంలో అత్యధికంగా 46.2 మి.మీ. వర్షం పడగా, నందిగామ మండలంలో 18.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కంచికచర్ల మండలంలో 12.6 మి.మీ, చందర్లపాడు మండలంలో 5.2 మి.మీ, వీరులపాడు మండలంలో 18.2 మి.మీ, జగ్గయ్యపేట మండలంలో 4.8 మి.మీల వర్షపాతం నమోదు కాగా పెనుగంచిప్రోలు మండలంలో 10.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రసాద్ వివరించారు.

### ఘనంగా ఎన్టీఆర్ జయంతి

నందిగామరూరల్: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఆర్డీఓ కె.బాలకృష్ణ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట మండలంలో...**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఈవోపీఆర్డీ పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏవో మాధవశర్మ, సీనియర్ అసిస్టెంట్ కిషోర్ కుమార్, హౌసింగ్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది లక్ష్మి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నమస్తే పథకం ప్రారంభం

నందిగామటౌన్: అసంఘటిత రంగంలోని వేస్ట్ పికర్స్, హెయిర్ పికర్స్ సేవలకు గుర్తింపు నిస్తూ వారికి సామాజిక భద్రత, ఆరోగ్య సేవలు, జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు నమస్తే పథకం దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఆపథకం రాష్ట్ర సమన్వయకర్త అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో బుధవారం ఆ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిశుభ్రతను కాపాడటంలో వేస్ట్ పికర్స్, హెయిర్ పికర్స్ కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. దళిత్ బహుజన్ రీసోర్స్ సెంటర్ సిబ్బంది వారి వివరాలను సేకరించి ప్రభుత్వ పథకాలు, హక్కులు, సేవలు పొందేందుకు మార్గదర్శకత్వం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లోని రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పనితీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు.

### సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పలు సమస్యలపై స్థానిక డాంగేనగర్‌కు చెందిన సామాజికకార్యకర్త లంకపల్లి రవిప్రసాద్ బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన కంపచెట్లు, పిచ్చిమొక్కల కారణంగా పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుబజారు ఎదురుగా వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.